www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024
5
తిరుపతి





నారా దేవాన్ష్ పుట్టినరోజు పురస్కరించుకుని తిరుమలలో



చాకలివాని గుంటలో దర్జాగా ఇల్లు నిర్మించుకుని చెరకు సాగు చేస్తున్న వైనం

చాకలివాని గుంట 'మాయం'

'గు(ం)ట'కాయ 'స్వాహా'

రెవెన్యూ కనుసన్నల్లోనే చెరకు సాగు

వేసవిలో మూగజీవాలకు నీరు లేక తిప్పలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పిచ్చాటూరు మండలం కీలపూడి గ్రామంలో 60 ఏళ్ల క్రితం చాకలివానిగుంటను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కీలపూడి లెక్కదాఖలా సర్వే నంబర్ 173/7లో ఒక ఎకరా 97 సెంట్లు భూమి ఉండేది. ఎండాకాలంలో మేయడానికి వచ్చిన ఆవులు, గేదెలు, మేకలు చాకలివానిగుంటలో నీటి దాహాన్ని తీర్చుకునేవి. అయితే ఉన్నట్టుండి చాకలివానిగుంట మాయమయ్యింది. ఏమయ్యిందా? అని పరిశీలించగా ఆక్రమణదారుని చేతిలో కనుమరుగై చెరకు పంట సాగవుతోంది. మిగిలిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి హాయిగా సంతోషంగా అనుభవిస్తున్నారు గుర్రప్పనాయుడు. ఈ రైతుకు గుంట చుట్టూ పది ఎకరాల పట్టా భూమి ఉంది. రెవెన్యూ కనుసన్నల్లోనే పక్కనే ఉన్న చాకలివాని గుంటను పొలంలో కలిపేసుకుని ఎంచక్కా పంటలు సాగు చేసుకుంటున్నాడు. బహిరంగ మార్కెట్లో దీని విలువ కోటి రూపాయల పైమాటే. అయినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డుల్లో ఎఫ్ఎంబిలో చాకలివాని గుంటగానే నమోదై ఉంది. గ్రామ అడంగల్‌లోనూ ఉంది. అయితే ఆ భూమి మాత్రం ఆక్రమణదారుని చేతిలో సాగవుతోంది. కలెక్టర్లకు, జాయింట్ కలెక్టర్లకు, ఆర్డీవోలకు ఎన్నిసార్లు మొరొ పెట్టుకున్నా పట్టించుకోలేదని పాడి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ భూమిని సంరక్షించాలని, బోర్డు పెట్టి కాపాడాలని వేడుకొంటున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చాకలివానిగుంటను రక్షించి, యథావిధిగా గుంట తవ్వి మూగజీవాల దాహార్ని తీర్చి మానవత్వం చాటుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం

హుస్సేన్ సాహెబ్, పిచ్చాటూరు



రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తాం. చాకలివానిగుంట అని ఉంటే తప్పకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించుకున్నా, పంటలు పండించుకుంటున్నా చట్టప్రకారం నేరం. అలాంటివారిని ఖచ్చితంగా అడ్డుకుంటాం. గుంట ఆక్రమణకు గురయ్యిందని తేలితే మాత్రం ప్రభుత్వం తప్పనిసరిగా స్వాధీనం చేసుకుంటుంది.

జనసేనకు లేని అభ్యంతరం మీకేంటి?

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్థానికుడు కాదని, నాన్ లోకల్ అని టిడిపి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ పది రోజుల నుంచి ఆత్మీయ సమావేశాలు పెట్టి, రెబల్ రాజకీయం నడుపుతున్న తీరుపై టిడిపి యువనేత నారా లోకేష్ అసహనం వ్యక్తం చేశారు. నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా తిరుమలకు విచ్చేసిన నారా లోకేష్ కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ కలిసారు. కొంతమంది ముఖ్య నేతలతో నారా లోకేష్ సమావేశమై పొత్తులో భాగంగా తిరుపతి ఎంఎల్ఎ టిక్కెట్ జనసేనకు ఇవ్వడం జరిగిందని, లోకల్, నాన్ లోకల్ అంటూ సమావేశాలు, సభలు పెట్టి కార్యకర్తలను గందరగోళం సృష్టించవద్దని క్లాస్ తీసుకున్నారు. జనసేన పార్టీకి లేని అభ్యంతరం టిడిపి నేతలకు ఎందుకని మండిపడినట్లు తెలుస్తోంది. తిరుపతి సీటును టిడిపి వదులుకోవడం తనకూ బాధగానే ఉందని, పొత్తులో భాగంగా తమ ధర్మాన్ని పాటించామన్నారు. టిక్కెట్ల విషయంలో గొడవలు సృష్టించవద్దని సూచించారు. టిడిపి అధికారంలోకి వస్తే పార్టీ ప్రోటోకాల్ పదవిని సుగుణమ్మకు ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులే ఉంటారని, అభ్యర్థిని మార్చుకోవడం, పాత అభ్యర్థిని కొనసాగించుకోవడం ఆ పార్టీ నిర్ణయం అని పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గరలో ఉందని టిడిపి శ్రేణులు ఎటువంటి గందరగోళంలో ఉండవద్దని, వైసీపీ అభ్యర్థి ఓటమి కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీ నమ్ముకున్న వారిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదని వారికి తగినంత గుర్తింపు ఇస్తామని నారా లోకేష్ చెప్పడం విశేషం. ఐవిఆర్ఎస్ సర్వే ప్రకారమే తిరుపతి జనసేన అభ్యర్థి అపార్టీ అధిష్టానం నిర్ణయించిందని పేర్కొన్నారు. దీంతోపాటు టిడిపి పార్లమెంటు తిరుపతి అధ్యక్షులు నరసింహ యాదవ్ తోనూ నారా లోకేష్ చర్చించారు. పార్టీలో అందరికీ టికెట్లు ఇవ్వలేమని, పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తామని చెప్పారు. పార్టీ శ్రేణులు అలకలు, కోపాలు మానుకొని గెలుపు కోసం పనిచేయాలని సూచించారు.

సుగుణమ్మకు నారా లోకేష్ 'క్లాస్'
గెలుపు కోసం పనిచేయాలని హితబోధ
ప్రచారం చేసుకోమని 'ఆరణి'కి భరోసా



నారా లోకేష్‌తో సుగుణమ్మ

నాగబాబు జోక్యం

తిరుపతి జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం నారా లోకేష్‌ను తిరుమలలో కలిసారు. 'లోకల్, నాన్ లోకల్' విషయమై ఫిర్యాదు చేశారు. అయితే ఈ సమస్యపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, టిడిపి నేతలు ఖచ్చితంగా కలిసి వస్తారని, రెండు మూడు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయని చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా జనసేనకు చెందిన కిరణ్‌రాయల్, రాజారెడ్డి ఆ పార్టీ ఇన్‌ఛార్జి నాగబాబును గురువారం కలిసారు. ఎంఎల్ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ గెలుపుకు కలిసి కృషి చేయాలని, లేదంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని నాగబాబు హెచ్చరించినట్లు సమాచారం.

నారా లోకేష్‌ను కలిసిన కోనేటి ఆదిమూలం

నారా లోకేష్‌ను సత్యవేడు సిట్టింగ్ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం, జడ్‌పి ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ మర్యాదపూర్వకంగా తిరుమలలో కలిసారు.



మృతదేహంతో పోలీసు స్టేషన్ ఎదుట నిరసన

అవమానభారంతో వ్యక్తి బలవన్మరణం

మృతదేహంతో నిరసన
ఎస్ఐపై చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - వెదురుకుప్పం

గ్రామంలో మృదు స్వభావి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. తన పని తాను చేసుకుంటూ గ్రామంలో గౌరవంగా బతికేవాడు. అయితే అన్నదమ్ముల మధ్య గొడవ జరిగిన నేపథ్యంలో పోలీసులు అతని షర్టు పట్టుకుని లాక్కెళ్లి పోలీసు స్టేషన్‌లో విచారించడంతో అవమాన భారం భరించలేక చంద్రశేఖర్ (56) ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతికి పోలీసులే కారణమని కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ మర్రిమాకులకండ్రిగ గ్రామానికి చెందిన చెంగయ్య, పాపమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు దేశయ్య, చంద్రశేఖర్. అన్నదమ్ముల మధ్య ఆస్తి గొడవలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఇటీవల గొడవ పడిన నేపథ్యంలో అన్న భార్య దేశయ్య భార్య శారద వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వెంకటేశులు తమ సిబ్బందిని గురువారం సాయంత్రం గ్రామానికి పంపాడు. పోలీసులు అతని షర్టు పట్టుకుని, గ్రామ వీధుల్లో అందరూ చూస్తుండగా లాక్కుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమదైన శైలిలో మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. అయితే అవమానంగా భావించిన చంద్రశేఖర్ పోలీసు స్టేషన్‌నుంచి తిరిగి వచ్చి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆస్తులుపోతే సంపాదించుకోవచ్చని, పోలీసుల దురుసు ప్రవర్తన వల్ల ప్రాణాలు పోయాయని, చంద్రశేఖర్ మృతికి పోలీసులే కారణమని మృతదేహంతో గ్రామస్తులు పోలీసు స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. చంద్రశేఖర్‌కు ముగ్గురు ఆడపిల్లలు. చంద్రశేఖర్ మృతిపై అతని తరపు బంధువులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లును విఆర్‌కు పంపుతున్నట్లు డిఎస్‌పి కె నరసింహమూర్తి తెలిపారు.

మే2 నుంచి ఎపిఆర్ సెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - క్యాంపస్



ఏపీ ఆర్ సెట్ 2023-24 ప్రవేశ పరీక్షలు మే 2 నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పీహెచ్.డీ సీట్ల భర్తీకి ఏపీ ఆర్ సెట్ 2023- 24 నోటిఫికేషన్ వెలబడిన విషయం తెలిసిందే. మార్చి 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే, ఈ నెల 29 వరకూ రూ. 2 వేలు అపరాధ రుసుంతోనూ, ఏప్రిల్ 6 వ తేదీ వరకూ రూ. 5 వేలు అపరాధ రుసుంతో దరఖాస్తు గడవు ఉంది.

ఏప్రిల్ 10వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఏపీ ఆర్ సెట్ 2023 -24 కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తెలిపారు. అవకాశాన్ని విద్యార్థులు, అభ్యర్థులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బెంగుళూరుకు చెందిన అగర్వాల్ ఇండెక్స్ పర్నస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళం అందించింది. ఈ సంస్థ ప్రతినిధి శ్రీ రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డిడిని తిరుపతిలోని పరిపాలన భవనంలో టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు.

17-25 తేదీల్లో కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి 25వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఏప్రిల్ 16వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 23న జరిగే సీతారాముల కల్యాణోత్సవంలో రూ.750 చెల్లించి గృహస్తులు పాల్గొనవచ్చు. 26న శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నారు.

ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం : లక్ష్మీ శ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు వారికి కేటాయించిన ఎన్నికల విధులను ఎంతో పకడ్బందీగా, పూర్తి అవగాహనతో అర్థం చేసుకోవాలని, ఎన్నికల్లో వీరి పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి జి.లక్ష్మీ శ అన్నారు. గురువారం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని పిఒ, ఎపిఒలకు జరిగింది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో పలు కొత్త అంశాలు, సూచనలు ఉన్నాయని, పూర్తిగా పిఒ హ్యాండ్ బుక్ చదివి అవగాహన కలిగి ఉండాలని, అపుడే ఎన్నికల నిర్వహణ సులువు అవుతుందన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మాత్రమే పోలింగ్ కేంద్రంలో పిఒలు విధులు నిర్వహించాలన్నారు. ఉదయం 5 గంటలకు రాజకీయ పార్టీల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. 17 (సి) ని రాజకీయ పార్టీల ఏజెంట్ల కు అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత సెక్టార్ అధికారికి, రిటర్నింగ్ అధికారికి తెలియ చేయాలన్నారు. విధులు కేటాయించబడిన నియోజకవర్గంలో ఆర్.ఓ ఆధ్వర్యంలో రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. పి.ఓ లు, ఏపీఓ లు, ఇతర పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఈవిఎంలను పోలింగ్ సామాగ్రిని తీసుకెళ్లేటప్పటి నుండి తిరిగి ఈవీఎంలను రిసెప్షన్ కేంద్రంలో అప్పగించే వరకు బాధ్యతగా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ ఆర్ ఓ తిరుపతి అదితి సింగ్ మాట్లాడుతూ హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇవ్వడం వలన ప్రతి ఒక్క ప్రిసైడింగ్ అధికారికి పూర్తి అవగాహన వస్తుందని, ఎంతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని, బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ జీఎం స్మార్ట్ సిటీ తిరుపతి చంద్రమౌళి, ఎస్డిసి మురళి పిఓల యొక్క పోలింగ్ నిర్వహణ బాధ్యతల గురించి విశదంగా శిక్షణ ఇచ్చారు. టెండర్ ఓట్, ఛాలెంజింగ్ ఓట్ తదితర అంశాలపై వివరించి, పలు ఫార్మాట్లపై ఆన్ హ్యాండ్ శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నోడల్ అధికారులు ప్రతాప్ రెడ్డి, బాల కొండయ్య పాల్గొన్నారు.



మాలో ఎవరికిచ్చినా సరే..!

బొజ్జల సుధీర్ రెడ్డికి మద్దతివ్వం
కూటమి అసమ్మతి నేతల నిర్ణయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తిలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి మద్దతు ఇవ్వబోమనీ, మిగిలిన వారిలో అధిష్టానం ఎవరిని నిర్ణయించినా విజయానికి కషి చేస్తామని కూటమి అసమ్మతి నేతలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య, జనసేన నియోజక వర్గం ఇన్ ఛార్జి వినుత కోటా, బీజేపీ జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి తమ అనుచరులతో పట్టణంలోని నగరివీధిలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో రహస్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ బొజ్జల కుటుంబం వంశపారపర్యంగా శ్రీకాళహస్తిలో రాజకీయం చేస్తోందన్నారు. ప్రస్తుతం బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. తనకు వయసు రీత్యా ఒక అవకాశం కల్పిస్తే గెలిచి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేసిన సేవా కార్యక్రమాలు తన విజయానికి దోహద పడతాయని ఎస్సీవీ అభిప్రాయపడ్డారు. ఇక జనసేన నియోజకవకర్గం ఇన్ ఛార్జి వినుత కోటా మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా తన పేరు జనసేన అధిష్టానం పరిశీలిస్తోందన్నారు. అందులో భాగంగానే తనను శుక్రవారం మంగళగిరి ప్రధాన కార్యాలయానికి రమ్మని అధిష్టానం పిలిచిందన్నారు. ఇక బీజేపీ జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పేరు పరిశీలనలో ఉందనీ, అందుకే ఆయన ఢిల్లీలో ఉన్నారన్నారు. పొత్తులో భాగంగా ఎవరికి టికెట్ ఇచ్చినా కలసి పని చేయాలని అసమ్మతి నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. కాగా అసమ్మతి నేతల తీరు శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది. పొత్తుల్లో భాగంగా అధిష్టానం కూటమి అభ్యర్థిని ప్రకటించిన తరువాత ఇలా ధిక్కరించడం ఏమిటని శ్రీకాళహస్తి వాసులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థికి లాభం చేకూర్చాలనే చెడు ఉద్దేశ్యంతోనే కూటమి అసమ్మతి నేతలు ఇలా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.



బొజ్జల సుధీర్‌కు యాంటీగా


మఠం సిబ్బందిని బంధించి కొట్టారు

ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)



హథీరాంజీ మఠం భూములను ఆక్రమించి ల్యాండ్ మాఫియాగా ఏర్పడి, పేదలను ఏమార్చి విక్రయిస్తున్నారని, అక్రమ నిర్మాణాల ఫొటోలు తీసిన మఠం సిబ్బందిని బంధించి భౌతికదాడులు చేశారని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు అన్నారు. మఠం భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గురువారం తిరుపతి మఠంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర పరిధిలోని ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న హథీరాంజీ మఠంకు చెందిన 242/బి లోని 9.89 ఎకరాల భూమిలో అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారన్న సమాచారంతో ఈ నెల 18న మఠం సిబ్బంది అక్కడకు వెళ్లి ఫోటోలు తీయడానికి ప్రయత్నించగా అక్రమ నిర్మాణదారులు మఠం సిబ్బందిని బంధించి భౌతికంగా తీవ్ర గాయాలు పాలు చేశారని, ఇద్దరి చేతిలో 50వేల రూపాయలు పెట్టి ఫోటోలు తీసుకొని ఈ విషయాలను బయటకు చెబితే లంచం అడిగారని కేసు పెడతామని బెదిరించారన్నారు. తమకు ప్రాణహాని ఉన్నందున భయపడి కేసు పెట్టలేదని మఠం సిబ్బంది చెప్పారన్నారు. 242/బి లోని స్థలాన్ని మఠం ద్వారా 2015లో లీజు పొందిన చిన్నరంగయ్య, పెద్దరంగయ్యలు ఎండోమెంట్ ట్రిబ్యునల్ ద్వారా ఏడాదికి 2 వేల రూపాయలు చెల్లించే విధంగా అనుమతి తెచ్చుకున్నారన్నారు. వ్యవసాయం చేసుకోవడానికి అని పొందిన భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ లీజు రద్దు చేయవలసిందిగా హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. అయితే హైకోర్టు మఠంకు, లీజుదారుడుకి స్టేటస్కో ఇచ్చిందన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్కో ఉత్తర్వులను గౌరవించకుండా తిరిగి సదరు భూమిలో దౌర్జన్యంగా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం సదరు స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాల ఫోటోలు తీసి ఎండోమెంట్ కమిషనర్ కు లేఖ రాశానన్నారు. స్పందించిన కమిషనర్ తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సదరు స్థలంలో నిర్మాణాలను ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని లేఖలు రాశారన్నారు. సదరు స్థలంలో కడప జిల్లాకు చెందిన నవీన్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారుడుగా ఉన్నాడని, అతనిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా అధికారులకు విజ్ఞప్తి చేశానన్నారు. హథీరాంజీ మఠం భూములపై సరైన పర్యవేక్షణ లేకపోయినకారణంగా నేడు మఠం భూములను కాపాడుకోవడం పెద్ద సవాలుగా మారిందన్నారు. 242/బి లో కొందరు పోలీసు ఉన్నతాధికారులూ స్థలాలు కొన్నట్టుగా సమాచారం అందిందని, దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఇకనైనా మఠం భూములను ఎవరు అమ్మిన కొనవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఈఓ శ్రీనివాసులరెడ్డి, లా అధికారిని ఎస్ వి. కవిత పాల్గొన్నారు.



సమాచార శాఖలో చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పేరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సమాచార విభాగంలో డిప్యూటీ కమిషనర్ గా చంద్రమౌళీశ్వర రెడ్డి పేరు ఉండడం విశేషం. ఆయన తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో అక్రమంగా ఓటర్ల చేర్పించారని రెండు నెలల క్రితం సస్పెండ్ అయ్యారు. అయినా ఆయన పేరు ఇంకా ఉండటం గమనార్హం.

నేడు పెంచలకోనకు నారా చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు జిల్లా రాపూరు సభకు శుక్రవారం హాజరుకానున్నారు. తిరుపతి జిల్లా సరిహద్దులో ఉన్న పెంచలకోన పెంచల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం జూబ్లీహిల్స్ వద్ద నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 3.20 నిమిషాలకు రాపూరు మండలం బోనుపల్లికి చేరుకుంటారు. పర్యటన ముగించుకుని తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. ఈనెల 24, 25 తేదీల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సొంత నియోజకవర్గమైన కుప్పానికి రానున్నారు.

వన సంరక్షణ సమితులకు చెప్పకనే...

నీలగిరి చెట్లు నరికి అమ్మకానికి

లారీలను అడ్డుకున్న గిరిజనులు

ప్రజాశక్తి - తొట్టంబేడు

సుమారు రెండు దశాబ్దాల కిందట వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో పెంచిన నీలగిరి చెట్లను అటవీశాఖ అధికారులు ప్రస్తుతం నరికేస్తున్నారు. నరికిన చెట్లను విక్రయించడానికి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్తుండగా గిరిజనులు అడ్డుకున్న సంఘటన గురువారం తొట్టంబేడు మండలంలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పచ్చదనం పెంచాలనే ఆశయంతో అటవీ సమీప గ్రామాల్లో వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్) ఏర్పాటు చేశారు. అటవీశాఖ, వన సంరక్షణ సమితి ఉమ్మడిగా రిజర్వు అటవీ ప్రాంతంలో నీలగిరి మొక్కలు పెంచారు. ఈ నీలగిరి మొక్కలు పెట్టి సుమారు రెండు దశాబ్దాలు కావడంతో ప్రస్తుతం కోతకు వచ్చాయి. ఈ చెట్లను కోయాలంటే వన సంరక్షణ సమితి వారు తీర్మానం చేసి సంతకాలు చేయాల్సి ఉంది. అయితే వీఎస్ఎస్ సభ్యుల తీర్మానం లేకుండానే నీలగిరి చెట్లను కోసి అమ్మేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. తొట్టంబేడు మండలంలోని గొట్టిపూడి అటవీ ప్రాంతంలో 12హెక్టార్లు, పిల్లమేడు పరిధిలో రెండు చోట్ల సుమారు పది హెక్టార్ల విస్తీర్ణంలో నీలగిరి మొక్కలు పెంచారు. ఇవి కోత దశకు రావడంతో ప్రస్తుతం వీటిని నరికేస్తున్నారు. నరికిన నీలగిరి కొయ్యలను తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల పరిధిలో గల ప్రైవేటు పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. ఇది తెలుసుకున్న గొట్టిపూడి గిరిజన కాలనీ వాసులు నీలగిరి కొయ్యలను తరలించే వాహనాలను అడ్డుకున్నారు. వన సంరక్షణ సమితి సభ్యుల నుంచి తీర్మానం లేకుండానే నీలగిరి చెట్లను నరికేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పెంచిన మొక్కలు విక్రయిస్తే వచ్చే ఆదాయంలో 50శాతం ఆ గ్రామ అభివద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. మిగిలిన 50శాతం అడవుల అభివద్ధికి ఖర్చు చేయాలి. అయితే అటవీశాఖ అధికారులు ఈ విషయం వన సంరక్షణ సభ్యులకు చెప్పకుండానే నీలగిరి చెట్లను నరికి విక్రయించడానికి తీసుకెళ్తుండటంతో గిరిజనులు, వన సంరక్షణ సభ్యులు అడ్డుకున్నారు. రిజర్వు అటవీ ప్రాంతంలో పెంచిన చెట్లను కోసే చోట అటవీశాఖ ఉద్యోగులు లేకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోందని గిరిజనులు అంటున్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి అటవీశాఖ రేంజర్ లోకేష్ ను వివరణ కోరగా... వన సంరక్షణ సభ్యుల నుంచి తీర్మానం తీసుకున్న తరువాతనే నీలగిరి చెట్లను కోస్తున్నామన్నారు. ఈ కొయ్యలను విక్రయించిన తరువాత వచ్చే సొమ్మును డీఎఫ్ వో ఖాతాలో జమ చేస్తారన్నారు. ఆ తరువాత ఇందులో సగం సొమ్మును వనసంరక్షణ సమితి ఖాతాలో జమ చేసి గ్రామ అభివద్ధికి ఖర్చు చేస్తామన్నారు. తొట్టంబేడు మండలంలో ఇలా చేస్తున్నారో లేదో తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటామని ఫారెస్టు రేంజర్ ఆఫీసరు లోకేష్ తెలిపారు. కాగా వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పెంచిన నీలగిరి చెట్లను అన్ని చోట్ల ఇలాగే కోసేస్తున్నట్లు తెలిసింది. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నేత హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.





ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

సుదీర్ఘకాలంగా జిల్లాలో నెలకొని ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా అందిస్తున్న సేవలు అందించడంలో ప్రతిష్టను తొలగించాలని, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు మంజూరు చేసేలా చూడాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గ్లోరియాకు గురువారం వినతిపత్రం సమర్పించారు. రిటైర్మెంట్ తుది చెల్లింపుల విషయంలో ఇబ్బందులు తొలగించాలన్నారు. ప్రతినెలా ఉద్యోగినుంచి వసూలు చేసే చందా మొత్తాలను ఆన్‌లైన్‌లో తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్, గౌరవాధ్యక్షులు పి సుధాకర్ రెడ్డి, సహాధ్యక్షులు రెహానా బేగం , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే దీనావతి, నాయకులు ఎస్పీ బాషా, ఏకాంబరం, పార్థసారథి, పంటపల్లి సురేష్, గణేష్ కుమార్, ఎంవి రమణ తదితరులు పాల్గొన్నారు

నేడు వైసిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం వైసిపి నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి గూడూరు వైసీపీ అభ్యర్థి మేరీగా మురళీధర్ హాజరు కానున్నారని ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, నల్లపరెడ్డి అభిమానులు పాల్గొనాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పాత బస్టాండ్‌లో రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణ పరిధిలో రాజనేని ఛారిటబుల్ ట్రస్ట్ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ట్రస్ట్ సభ్యుడు రామానాయుడు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఏర్పాటు చేసిన చలివేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్ట్ సభ్యులు పిచ్చయ్య నాయుడు, బాబు పాల్గొన్నారు .

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి రేణిగుంటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, కుటుంబాల వారు స్థానిక వైసిపి కార్యాలయంలో బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆపత్కాలంలో అండగా నిలిచిన బియ్యపు మధుసూదన్ రెడ్డికి తాము అండగా నిలబడతామని ఈ సందర్భంగా ముస్లింలు తెలిపారు. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి,జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ రసూల్, రఫీ, సలీం, చాంద్ బాషా, చాందిని, రష్మ, షబ్బీర్, మెహబూబ్ భాష, ఇబ్రహీం పాల్గొన్నారు.

టిడిపి సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద ఉన్న టిడిపి కార్యాలయం లో గురువారం 24 పంచాయతీల గ్రామ నాయకులుతో మండల నాయకులు, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి రెడ్డి, మండల టిడిపి ప్రెసిడెంట్ సంచి కృష్ణయ్య, రమేష్ నాయుడు,కార్యదర్శి దేవేందర్ రెడ్డి, పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బెన్నీ, టిడిపి నాయకులు జీ.రామకృష్ణ ,పోలయ్య మొదలైన నాయకులు గత రెండు రోజుల క్రితం ఎండి సి సి బి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తమ పార్టీ నాయకులపై చేసిన విమర్శలు తన స్థాయికి తగినవి కావని ఎలాంటి సవాలనైనా ఎదురుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఇకనైనా స్థాయి మరిచి విమర్శించడం మంచిది కాదని ,మానుకోవాలని ప్రతి నాయకుడు తనదైన శైలిలో ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికలు ఎంతో కాలం లేదని తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కం. శివకుమార్, ప్రసాద్ నాయుడు, హరి నాయుడు, ఏడుకొండలు, వెంకటా చలపతి, యుగంధర్, సిద్దలయ్య , కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటేశ్వర్లు గ్రామస్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : జిల్లా టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపాల్టీ మొదటి వార్డు మిట్టపల్లూరు లో గురువారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా షణ్ముగ రెడ్డి మాట్లాడుతూ తాము చేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు చొక్కలింగారెడ్డి, నాయకుల అర్ముగరెడ్డి, మురుగేశ్ రెడ్డి, బాలాజీ, గోపాల్, గణేష్, మణి రెడ్డి, రాజా, ఇరసారెడ్డి, సుబ్రహ్మణ్య రెడ్డి, సుబ్బారామి రెడ్డి, గోవింద్ స్వామి రెడ్డి, వెంకటముని, మునిరెడ్డి, మునిరత్నం, నాగరాజు, కృష్ణవేణి, కుప్పారెడ్డి, చంద్రశేఖర్ ఢిల్లీ బాబు, సురేష్, రమేష్ దేశమ్మ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ పంచాయతీకి చెందిన 153 మంది వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలు గురువారం టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. మంగళం ప్రాంతంలో మరికొందరు ముఖ్య నాయకులు టిడిపిలో చేరడానికి సుముఖత చూపుతున్నారని, వారు త్వరలో టిడిపిలో చేరుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు: ఎంపిడీవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో 24 పంచాయతీలకు ఇంటి పన్ను వసూలు అయిందని ఆయా పంచాయతీ కార్యదర్శిలు తెలిపారు. కంచన పుత్తూరు, కనమనం వేడు గ్రామాలలో 100 శాతం పంచాయతీ పన్ను వసూలు అయినట్లు బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి ఇందిరా తెలిపారు. మిగిలిన పంచాయతీలో కూడా ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను త్వరగా చెల్లించాలని ఆయా పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు. ఈ పంచాయతీ పనులు వల్ల పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా సకాలంలో అందించవచ్చునని తెలిపారు. పంచాయతీ సర్పంచులు కార్యదర్శులు చొరవ తీసుకొని పంచాయతీలోని ప్రజలకు సహకరించాలని వారు పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారుడు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిర, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: సార్వత్రిక ఎన్నికలు -2024 నేపథ్యంలో జిల్లా ఎస్పీ కష్ణ కాంత్ పటేల్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా, తిరుపతి సబ్ డివిజన్, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంచార్జ్ సీఐ జయ నాయక్, ఎస్సై రామాంజనేయులు, బిఎస్ఎఫ్ ఎస్సై జి.సి.ఘోష్ ఆధ్వర్యంలో వైకుంఠపురం నుంచి ఫ్లాగ్ మార్చ్ ప్రారంభమై ముత్యాల రెడ్డి పల్లి, అన్నమయ్య సర్కిల్, రాయలచెరువు రోడ్డు మీదుగా రాయల్ నగర్, న్యూ మారుతి నగర్, అమరావతి నగర్, శాంతినగర్, సీతమ్మ నగర్ ప్రాంతాల పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఓటర్లకు ధైర్యం కలిగించడానికి, ఓటర్లను చైతన్యవంతులు చేయుటకు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ రక్షక్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, బిఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

పెట్రోల్ బంకుల మోసం!

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: పట్టపగలే పెట్రోలు బంకుల్లో యథేచ్ఛగా మోసాలు సాగుతున్నాయి. నిఘా వేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం డడంతో వినియోగదారులు భారీగా మోసపో యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి పట్టణంలోని అడ్డరోడ్ సెంటర్లోని ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకులో గురువారం ఆయిల్ పట్టుకున్న ఓ వినియోగ దారుడు విస్తుపోయి తమ ఆవేదనను తెలిపాడు. వరి కోత యంత్రాల సూపరువైజరుగా వున్న ఓ వ్యక్తి ఇండియన్ ఆయిల్ డీజిల్ ప్రతిరోజూ ఏడువేల రూపాయలకు తీసుకెళుతుంటానని తెలిపారు. అయితే ప్రతిరోజూ ఈ బంక్‌లో డీజిల్ తక్కువ వస్తోందని గమనించిన ఆ వ్యక్తి గురువారం బంకులో బాయ్స్ చేసే మోసాన్ని పసిగట్టి నిలదీశాడు. డీజిల్ పట్టే వాహనదారుడుకి బాయ్‌కి మధ్య వివాదం తలెత్తడంతో ఆ బంకు మేనేజర్ సర్దిచెప్పి పంపారు. ఏడువేల రూపాయలకు డీజిల్ కొనుగోలు చేస్తే, 200 రూపాయల నుండి 250 రూపాయలు వరకు ఈ బంకులో మోసపోవాల్సి వస్తోందని దీనిపై నిలదీస్తే సక్రమంగా డీజిల్ పంపింగ్ చేశారని తెలిపారు. ఈ బంకులో ముగ్గురు వ్యక్తులు ఇలా వాహనదారులను మోసం చేస్తున్నారని, కొలతల అధికారులు తనిఖీలు చేసే పరిస్థితి లేకపోవడంతో పెట్రోల్ బంకులు ఎలా మోసగిస్తున్నాయో తెలిసిందన్నారు. జిల్లా సంబంధిత అధికారులు ఈ మోసాన్ని అరికడుతామని వినియోగ దారులకు భరోసా కల్పించాలని కోరాడు.

నేటి సమాజానికి యువత అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : నేటి సమాజానికి యువత ఎంతో అవసరమని వారు నిర్వహించాల్సిన విధులు గురించి నెహ్రూ యువజన సేవాసంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-15, దత్త గ్రామమైన మల్లంగుంటలో ఇంజనీరింగ్ ఈసీఈ వాలంటీర్లు, ప్రోగ్రాం అధికారి డాక్టరు డి. యువశ్రీ గురువారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి నెహ్రూ యువజన సేవాసంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో యువత నిర్వహించాల్సిన విధులు గురించి తెలిపారు. సమాజ కార్యక్రమాల్లో యువత ఎలా పాల్గొనాలో వివరించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్రం విభాగం నుంచి విద్యార్థులు విచ్చేసి బాలల హక్కులు, సైబర్ క్రైమ్, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందిస్తున్న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి -కోట : గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా వుండవచ్చని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శ్రీ ప్రగతి విద్యా సంస్థల కో ఆర్డినేటర్ వెంకయ్య పేర్కొన్నారు. కోట మండలంలోని శ్రీ ప్రగతి విద్యా సంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సేవలో భాగంగా చంద్రశేఖర పురంలో గురువారం స్పెషల్ క్యాంపు నిర్వహించారు. పరిశుభ్రతపై అవగా హన ర్యాలీ ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలిగించి పరిసరా లను పరిశుభ్రం చేశారు. దోమల నిర్మూ లనకు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థి నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వియు రిజిస్ట్రారు అవినీతిపై 2017లో నిరసన తెలిపిన పలు విద్యార్థి సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేస్తూ గురువారం తీర్పు ఇచ్చింది. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యా లయం 2017 సంవత్సరం అప్పటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్ దేవరాజుల నాయుడు అవినీతి, అక్రమాలకు పాల్ప డ్డారని, వారి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్వీ యూనివర్సిటీలో వైఎస్ఆర్ విద్యార్థి విభాగం, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐల ఆధ్వర్యంలో నెల రోజులపాటు తీవ్రంగా బంద్‌లు, బాయ్‌కాట్‌లు నిర్వహిం చారు. ఈ నేపథ్యంలో వైసిపి విద్యార్థి నాయకులు వి హరిప్రసాదరెడ్డి, పోతు మురళీధర్, పి హేమంత్ కుమార్ రెడ్డి, డిజె సుధీర్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయ కులు శివారెడ్డి, చలపతి, శశి, ఏఐవైఎఫ్ కత్తి రవి, ఎన్ఎస్‌యు ఐ అమృతేజ, వసీంఅక్రంతో పాటు మొత్తం 21 మంది పై అక్రమంగా ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని కేసు ...చారించిన తిరుపతి 4వ ఏడిజె న్యాయస్థానం గురువారం కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయ కులు గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపైన సాధించిన ఘన విజయంగా అభివర్ణించారు.



హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం ఎందుకు?: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : త్వరిత గతిన పైపు లైన్ మరమ్మతు లు చేసి గూడూరు పట్టణ ప్రజలకు సకాలంలో నీరు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొ న్నారు. గూడూరులోని ఆయన నివాసంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ నిర్బంధ పన్నుల వసూళ్ళ అయితే త్వరగా చేస్తారని, కానీ మంచినీళ్ళు మాత్రం ఇవ్వరా?..గూడూరు పట్టణ ప్రజలపై ఇంత నిర్లక్ష్యమా?' అని ప్రశ్నించారు.గూడూరు పట్టణంలో మూడు రోజుల నుండి నీటి సరఫరా లేక గూడూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పగిలిన పైపులైన్లు యుద్ధం ప్రాతిపదికన బాగుచేయాల్సి వు న్నా పట్టించుకోకుండా నీటి సరఫ రా పునరుద్ధరించడానికి ఇంకా రెండు రోజులు పడు తుందని చెప్పడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. శుక్రవారంలోపు నీటి సరఫరాని పునరుద్ధరించి పట్టణ ప్రజలకు నీరు అంధించకపోతే శనివారం పట్టణ ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని బిందెలతో ముట్టడిస్తామని హెచ్చరించారు.




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌టి కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏర్పేడు మండలం కోబాకు గ్రామపంచాయతీ మిట్ట ఎస్‌టి ఎరుకల కాలనీ లోని తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమిం చుకుంటూ దాడికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఎస్టి కాలనీ వాసులు అభ్యర్థించారు. గురువారం ప్రెస్ క్లబ్ లో ఎస్టి కాలనీకి చెందిన బాధితులు జి. రామసుబ్బమ్మ, జి.వెంకటేశ్వ ర్లు, నాగయ్య మాట్లాడుతూ కోబాక గ్రామపంచాయతీ మిట్టలోని సర్వేనెంబర్ 174లో గ్రామ కంటం భూమిలో సుమారు 15 కుటుంబాలు నివాసం వుంటు న్నాయని ఇదే కాలనీలో 40 సంవత్సరాల క్రితం ఉండి ఉద్యోగరీత్యా గ్రామం వదిలి వెళ్లిన వెంకటయ్య కుమారుడు అరుణ్ కాలనీలోని తమ స్థలాలను ఆక్రమించుకుంటూ కబ్జా చేసేందుకు యత్నిస్తున్నా డని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నాడని తెలిపారు. వృత్తిరీత్యా కానిస్టేబుల్ అయిన అరుణ్ పోలీసుల దౌర్జన్యంతో గ్రామంలోకి వచ్చి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తు న్నా రన్నారు. వారి దౌర్జన్యానికి భయపడి గత ఏడా ది కాలంగా తమ కుటుంబం ఏర్పేడులో జీవనం సాగిస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు సైతం ఈ ఆక్రమణను అడ్డుకున్నారని, కబ్జాదారులు వారి పై ఎదురు దాడి చేస్తున్నారన్నారు. ఎక్కడికి వెళ్లి ఫిర్యాదు చేసినా అరుణ్ కానిస్టేబుల్ కావడంతో న్యాయం జరగకపోగా తిరిగి వేధింపులు ఎదురవుతు న్నాయన్నారు. ఉన్నతాధికారులు తమ గోడును విని న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎస్‌టి కాలనీ వాసులు

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

సత్యవేడు మండల సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్

ప్రజాశక్తి -సత్యవేడు: అర్హులైన పౌరులందరూ ఓటు హక్కు వినియోగిం చుకునేలా ప్రోత్సహించాలని తిరుపతి జిల్లా సత్యవేడు మండల సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు అక్షరాస్యత, ఎన్నికల ప్రక్రియకు ఓటర్లను సంసిద్ధం చేయడంపై(స్వీప్) పంచాయతీ సెక్రటరీలకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని ఓటర్లకు అందిం చాలని ఉద్దేశంతో స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొ న్నారు. ఎన్నికల సమయంలో సమాచారంతో కూడిన నిర్ణయాన్ని ఓటర్లు తీసుకునే అవకాశం ఏర్పడుతుంద న్నారు. ఎన్నికల సంఘం సి విజిల్ యాప్ ద్వారా ఎన్నిక ల ప్రచారంలో,ఎన్నికల సమయంలోనూ చోటు చేసుకునే అవకతవకలపై సంబం ధిత జిల్లా ఎన్నికల అధికారికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే త్వరగా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సివిజిల్ యాప్‌పై, ఎన్నిక ల కోడ్ ఉల్లంఘనపై ఎలా ఫిర్యాదు చేయాలో ఓటర్లకు వివరిం చాలన్నారు. వృద్ధులకు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కును వినియోగిం చుకునే వెసులుబాటు వచ్చిందన్నా రు. ఈ కార్యక్రమంలో సత్యవేడు పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, ఇరుగుళం సెక్రటరీ ప్రకాష్,మాధవి, కుముద, యుగంధ ర్, లీలామాధవ్, లోకేశులు, రమణ మూర్తి, జలజశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోషియల్ మీడియా మండల నోడల్ అధికారి హరీష్

ఎన్నికల నియమావళిని పాటించాలి: ఆర్‌డీవో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్‌డీవో కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డ బ్ల్యు కళాశాలలో ఎన్నికల సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ సి. ఎన్. నాయుడు, తదితరులు పర్యవేక్షించారు.

ఏర్పేడు : శ్రీకాళహస్తి రేణిగుంట ఏర్పేడు మండలాల పి ఓ ఏ పి ఓ లకు ఒక్కరోజు శిక్షణలో భాగంగా మొదటి విడత ఐఐటి ఏర్పేడు లో గురువారం నిర్వహించారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ ఎన్ రవి శంకర్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. 168 వ అసెంబ్లీ కాన్సెన్సీ, 23 వ తిరుపతి ఎస్సీ పార్లమెంటు సెగ్మెంట్ కు సంబంధించి పిఓలు ఏపీవోలు అందరూ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవోలు ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎన్నికల నియమావళి పై ఆర్డీవో ఇతర అధికారుల బృంద సభ్యులు శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు తహశీల్దారు ఉదయ భాస్కర్ రాజు, రేణిగుంట తహశీల్దారు నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి తహశీల్దా రు జనార్దన్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు పర్య వేక్షించారు.



సమావేశంలో మాటలాడుతున్న గూడూరు ఆర్‌డీవో కిరణ్‌కుమార్

విద్యార్థులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దామోదర్ నాయుడు అధ్యక్షతన ప్రాథమిక ఆరోగ్య అధికారి దివాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు రక్త పరీక్ష, యూరిన్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు కలిగి ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మండలంలో గ్రామ పంచాయతీ ప్రజలు వాతావరణం కారణంగా పలు రకాల విష జ్వరాలు ప్రబలం కావడంతో భయాందోళన గురవుతున్నట్లు వారు తెలిపారు. విష జ్వరాలు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, గ్రామ ఏఎన్ఎంలు, జిఎన్ఎంలు పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న ప్రభుత్వ వైద్యులు

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటిన మోనిష్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో శ్రీకాళహస్తి మండలం చల్లపాలెం విద్యార్థి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. చల్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువు తున్న ఎం.మోనిష్ జాతీయ స్థాయిలో 1278వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు మునిలీలావతి, విద్యా కమిటీ సభ్యులు విద్యార్థి మోనిష్‌ను అభినం దించారు.

'పౌష్టికాహారం బాధ్యతగా పంపిణీ చేయాలి'



ప్రజాశక్తి -బాలాయపల్లి : పౌష్టికాహారం భాధ్యతగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపరువైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నాయుడు చెరువు కండ్రిగ గ్రామంలోని పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్హత ఉన్న వారికి అందించాలన్నారు. బరువు తక్కువ, వయసుకు తగిన ఎత్తు లేనివారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అంగనవాడీ సిబ్బంది అంగన్‌వాడీ కార్యాలయంలో పౌష్టికాహారం తినే విధంగా పర్యవేక్షించా లన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ, మహిళా రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు 23 మంది అర్హత

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు శివ పబ్లిక్ స్కూలుకు చెందిన 28 మంది విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నిర్వ హించిన ప్రవేశ పరీక్షలకు శ్రీకాళహస్తిలో హాజర య్యా రు. ఇందులో 23 మంది ఉత్తీర్ణత సాధించినట్లు శివ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య , డైరెక్టర్ ప్రసన్నలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా జి హరినాథ్ అత్యధిక మార్కులు 50 మార్కులకు 41 మార్కులు సాధించి ప్రథమ స్థాయిలో నిలిచినట్లు స్కూలు ప్రధానోపాధ్యాయులు గురుచంద్ర తెలిపారు. మహమ్మద్ అర్హాన్ 40 మార్కులు, ఏ .మనోహర్ 37 మార్కులు సాధించారని వారు తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని సిఐ దివాకర్ రెడ్డి కోరారు. ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ పోలీస్ బలగాలు కంచరపాలెం కరిపాకం తదితర గ్రామాలలో గురువారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛ వాతావరణంలో తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని నిర్భయంగా ఓటు వేయడానికి భరోసా కల్పించడమే ధ్యేయంగా ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు ప్రలోభాలకు ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐ షణ్ముగం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గాలి భానుప్రకాష్

సుబ్రహ్మణ్యం యాదవ్ మృతికి నివాళులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

అప్పలాయిగుంట వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురానికి చెందిన మేకల సుబ్రమణ్యం యాదవ్ గత కొద్ది రోజులు గా అనారోగ్యంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఎస్‌బిఆర్‌పురానికి వెళ్లి సుబ్రహ్మణ్యం పూలమాలవేసి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. వారిని ఓదార్చారు. ఆయన వెంట ఎస్ బి ఆర్ పురం సర్పంచి మని రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం కుప్పిగానిపల్లి పంచాయతీ పరిధిలోని 14 మంది వాలంటీర్లు గురువారం వారి ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రత్యక్షంగా ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని నిబంధన ఉండటం వల్ల తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి ఎన్నికల్లో పాల్గొంటామని తెలిపారు. నిరుద్యోగులుగా ఉన్న తమకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని, ఆయన గెలుపు కోసం, స్థానిక అభ్యర్థి భరత్ గెలుపుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామ్మూర్తి, ఎంపిటిసి వెంకటేష్ పాల్గొన్నారు.

16 నుండి కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి) :

చంద్రగిరిలోశ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16వ తేదీ అంకురార్పణతో ప్రారంభం కానున్నాయని ఆలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగిరిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి 25వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 17వ తేదీ ఉదయం 9.05 నుండి 10 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు శ్రీ కోదండ రామస్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.రూ.750లు చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సర్లకు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.